క్లుప్తంగా

సాదాసీదాగా మండల పరిషత్ సమావేశం

అచ్చంపేట(క్రోసూరు): అచ్చంపేట మండల సర్వసభ్య సమావేశం బుధవారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జరిగింది. ఎంపీడీఓ శ్రీనివాసరావు అధ్యక్షత ఎంపీపీ గంగసాని బాబు, అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖలలో జరుగుతున్న పనుల పై మాట్లాడారు. ఎంపీపీ గంగసాని బాబు మాట్లాడుతూ మండలాన్ని సమష్టిగా అభివృద్ధి చేసేందుకు అధికారులందరూ కృషి చేయాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ దీపావళిని జరుపుకొందాం

క్రోసూరు: అందరూ పర్యావరణ పరిరక్షణ దీపావళిని జరుపుకోవాలని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసస్ కోరారు. క్రోసూరులో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టపాసులు కాల్చినప్పుడు శబ్దం 140 డెసీబుల్స్ దాటుతుందని ఈ శబ్దాల వల్ల తాత్కాలిక చెవుడు, శాశ్వత చెవుడు ఏర్పడుతుందన్నారు దీపావళి సందర్భంగా టపాకాయలు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించటం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. టపాకాయలు కాల్చేటప్పుడు ఆల్కహాల్ శానిటైజర్‌లను వాడి టపాకాయలను వెలిగించకూడదన్నారు. పర్యావరణ పరిరక్షణ దీపావళిగా జరుపు కొందామని శాంసస్ పిలుపునిచ్చారు.

పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్లు పంపిణీ

సత్తెనపల్లి: పట్టణంలోని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు 156 మందికి పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్(పీపీఈ) కిట్లను బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ రంగిశెట్టి సుమన్ కుమార్, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు ఉన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



సత్తెనపల్లి: ఎరువులు అధిక ధరలకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా డీలర్లపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సత్తెనపల్లి ఇన్‌చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీధర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎరువుల డీలర్లు రైతులకు ఎరువుల అమ్మకాలు జరిపేటపుడు తప్పనిసరిగా బిల్లుపై రైతు ఫోన్ నంబర్, వారి పూర్తి వివరాలు నమోదు చేయాలని సూచించారు. డీలర్లు ప్రతి రోజు స్టాకు డిస్‌ప్లే బోర్డులో ఎరువుల నిల్వలు అప్డేట్ చేయాలన్నారు. తనిఖీలో వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు మాదల విద్యార్థిని



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని జిల్లా ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం జి.రమేష్ బుధవారం తెలిపారు. అక్టోబర్ 25,26,27 తేదీల్లో సత్యసాయి జిల్లా, హిందూపురంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ -14 ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా ఫుట్‌బాల్ టీంలో పాఠశాలకు చెందిన విద్యార్థినులు పెండెం ప్రవల్లిక, కొల్లిబోయిన త్రివేణిలు బాలికల టీంలో పాల్గొని ప్రతిభ కనపరిచారన్నారు. వీరిలో పెండెం ప్రవల్లిక జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయిందని తెలిపారు. నవంబర్‌లో మహారాష్ట్రలోని నాంథేడ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పి.సాంబశివరావు, పీడీ సత్యవతి, ఉపాధ్యాయులు అభినందించారు.

21 మద్యం సీసాలు స్వాధీనం

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలోని బీసీ కాలనీలోని ఓ గృహంలో అక్రమంగా నిల్వ ఉన్న 21 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని గృహ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.సోమేశ్వరరావు బుధవారం తెలిపారు. అందిన సమాచారం మేర గ్రామంలోని బీసీ కాలనీలోని బొడ్డేటి శేఖర్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంలో అతని గృహంలో తనిఖీలు నిర్వహించగా 21 మద్యం(180ఎం.ఎల్)సీసాలు ఉన్నట్లుగా గుర్తించామన్నారు. కేసు నమోదు చేశామని తెలిపారు.

చిత్తయిన పత్తి రైతు

- భారీవర్షాలు, వరదలతో దెబ్బతిన్న పత్తిపంట
- ఎకరాకు రూ.15వేల వరకు నష్టపోయిన రైతులు
- ఎకరాకు రూ.6–8 క్వింటాళ్ల వరకు తగ్గిన దిగుబడులు
- ప్రభుత్వం సీసీఐ కేంద్రాలు తెరవకపోవడంతో నష్టాలకు అమ్ముకుంటున్న వైనం



పెదమద్దూరులో మొక్కపైనే తడిసిన పత్తి

అమరావతి: వాతావరణ ప్రతికూలత, భారీవర్షాలు, వరదలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిన వ్యవసాయ ఖర్చులతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈఏడాది పెదకూరపాడు నియోజకవర్గంలో 29,511హెక్టార్లలో పత్తిపంట సాగుచేశారు. భారీ వర్షాలు, వరదల కారణంగా కొన్ని ప్రాంతాలలో పూర్తిగా, మరికొన్ని ప్రాంతాలలో పాక్షికంగా దెబ్బతినటంతో పత్తిరైతుల కష్టాలు మొదలయ్యాయి. కూలీ రేట్లు అధికం కావడం సైతం రైతులకు ప్రతికూలంగా మారింది.

పెట్టుబడులు నీటిపాలు

ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో పత్తిపైరుకు వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు ఎంతో ఉత్సాహంగా సాగుకు శ్రీకారం చుట్టారు. ఆగష్టు నెల రెండవ వారం వరకు సమయానికి వానలు పడి పత్తి రైతుల్లో ఆనందం వెల్లి విరిసింది. ఇంకేముంది ఈ ఏడాది దిగుబడులతో కష్టాలు తీరినట్లే అని అందరూ భావించారు. కాని ఆగష్టు చివరివారం, సెప్టెంబరు మొదటి రెండు వారాలు భారీ వర్షాలు, కృష్ణానదితో పాటుగా వాగులు, వంకలు పొంగటంతో చేతికొచ్చిన పంట దెబ్బతిని పత్తిరైతు కుదేలయ్యాడు. ఎకరానికి రూ.20 వేల వరకు పెట్టిన పెట్టుబడులన్నీ నీటి పాలయ్యాయని రైతులు వాపోతున్నారు. వరదలు వానల కారణంగా పోయిన పంట పోగా, మిగిలిన మొక్కల్లో కూడా పూత, పిందె రాలిపోవడం, కాయలు కుళ్లిపోవడం జరగడంతో రైతులు ఎంతో నష్టపోయారు. మొదటి విడత ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్ల పంట దిగుబడి తగ్గిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

అప్పులు మిగిలే పరిస్థితి..

ఈఏడాది ఎకరాకు రూ.12 వేలనుంచి 18 వేల వరకు కౌలు పలకటంతో కౌలు రైతుకు ఎకరా పత్తి సాగు చేయాలంటే సుమారు రూ.30వేల నుంచి 35 వేల వరకు ఖర్చుఅయింది. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టిన కౌలు రైతుకు దిగుబడి తగ్గి అప్పులు మిగిలే పరిస్థితి ఉంది. గతేడాది ఎకరానికి 15 నుంచి 17క్వింటాళ్ల వరకు దిగుబడి రాగా ఈ ఏడాది పత్తి మొక్కలు మొద్దుబారి 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చిందని రైతులు చెబుతున్నారు. విపరీతమైన ఖర్చుతో వ్యవసాయం చేసి దిగుబడి తగ్గి గిట్టుబాటు ధర లేక కౌలు రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది.



పత్తి కాటా వేస్తున్న దృశ్యం

పెరిగిన కూలిరేట్లతో అదనపు భారం..

వ్యవసాయం లాభసాటిగా లేకపోవటంతో దీన్నే నమ్ముకుని ఉన్న అనేక మంది వ్యవసాయ కూలీలు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవటంతో వ్యవసాయంలో కూలీల కొరత ఏర్పడింది. దీనితో కూలీలకు డిమాండ్ పెరిగి కూలి రేట్లు పెంచటంతో రైతులకు అదనపు భారం పడుతుంది. గతంలో కంటే సంవత్సర కాలంలో ఎకరాకు సుమారు రూ.3వేల నుంచి 4వేల వరకు అదనంగా కూలీలకు ఖర్చు పెరిగింది. ప్రస్తుతం రోజుకు పత్తి తీయటానికి రూ.300 నుంచి 400 వరకు కూలీ తీసుకుంటున్నారు. ఈక్రమంలో క్వింటా పత్తి తీయటానికి రూ.1500 నుంచి 2500 వరకు ఖర్చు అవుతుంది.

గిట్టుబాటు ధరేది?

ప్రస్తుతం మార్కెట్‌లో పత్తి దిగుబడులు తగ్గి ప్రభుత్వం సీసీఐ ద్వారా రైతు దగ్గర పత్తిని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయకపోవటంతో దళారులదే రాజ్యంగా మారింది. సీసీఐ కొనుగోలు చేసే ధర రూ.7200 ఉండగా, ప్రైవేటు దళారులు కొనుగోలు చేసే ధర రూ.5600–5700వరకు ఉంది సీసీఐ తెరచి కొనుగోలు చేయకపోవటంతో ఇదే అదనుగా చేసుకుని దళారులు అనేక కారణాలు చూపించి రైతుల వద్ద పత్తిని వీలైనంత తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేసి రైతులకు, కౌలు రైతులకు సహాయం అందించాలని, పంటలు పూర్తిగా నష్టపోయిన రైతులకు ప్రత్యామ్నాయ పంటలకు ఎరువులలో, విత్తనాలలో రాయితీలు కల్పించాలని, అన్ని పంటలకు గ్రామం యూనిట్‌గా బీమా సౌకర్యం అందించాలని రైతులు కోరుతున్నారు.

ఎకరాకు రూ.15వేల వరకు నష్టం



వర్షాలకు పత్తిలో మొదటికాపులో ఎకరాకు సుమారు ఐదు క్వింటాళ్ల నుంచి 7క్వింటాళ్ల వరకు పంట కుళ్లిపోయింది. వర్షాల వల్ల సుమారుగా ఎకరాకు రూ.15వేల వరకు నష్టపోయాం. పత్తి పంట నష్టపోయిన రైతులలో కొంతమందికే ప్రభుత్వసాయం అందింది. మిగిలిన వారికి కూడా సాయం అందిస్తే రైతులు కొంతవరకు తేరుకుంటారు.

– యన్నం సైదారెడ్డి, రైతు, ఘునగోడు

కౌలు చెల్లించే పరిస్థితి కూడా లేదు



కౌలు రైతులను గుర్తించటంలో తప్పులు జరిగాయి. భూముల యజమానుల నుంచి కూడా కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. బ్యాంకుల్లో రుణాల పంపిణీలోగాని, సబ్సిడీ విత్తనాలలో గాని ఎటువంటి సహాయం అందక పెట్టుబడులు పెరిగి వాతావరణం అనుకూలించకపోవటంతో నష్టపోతున్నాం. కౌలు రేట్లు పెరిగి దిగుబడులు తగ్గటంతో కౌలు చెల్లించే పరిస్థితి కూడా లేదు.

– జెట్టి నాగరాజు, కౌలురైతు, జూపూడి

నష్టపోతున్నాం..



నిత్యావసరాల రేట్లు పెరగటం, కూలీల కొరత వంటి కారణాలతో కూలి రేట్లు పెరిగి రైతుపై అదనపు భారం పడుతుంది. దీనికి తోడు ప్రభుత్వం సీసీఐని తెరవకపోవటం వల్ల రూ.7వేలకు పైగా అమ్ముకోవాల్సిన పత్తిని రూ.5700కు అమ్ముకుని నష్టపోతున్నాం. సీసీఐ ద్వారా రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తే కొంతవరకు పరిస్థితి మెరుగుపడుతుంది.

– రమావత్ రామకృష్ణనాయక్, రైతు,పెదమద్దూరు

డయల్ యువర్ డీఎంకు ఐదు వినతులు

సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం నిర్వహించిన డయల్ యువర్ ఆర్టీసీ డీఎంకు ఐదు వినతులు వచ్చినట్లు డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ తెలిపారు. క్రోసూరు మండలం దొడ్లేరు నుంచి అచ్చంపేట మండలం నిండుజర్ల వరకు బస్సు ఎక్స్‌టెన్షన్ కావాలని 88 తాళ్లూరు గ్రామానికి చెందిన ఖాసిం కోరగా .. ఉన్నతాధికారులకు తెలియపరిచి తగిన నిర్ణయం తీసుకుంటామని డీఎం సమాధానం ఇచ్చారు. హైదరాబాద్ సర్వీస్ బాగా పాతబడిపోయిందని, కొత్త బస్సులు పెట్టాలని సత్తెనపల్లికి చెందిన ఆంజనేయులు అనే ప్రయాణికుడు కోరగా ... ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రయార్టీ ప్రకారం కొత్త బస్సులు వచ్చిన వెంటనే మారుస్తామని డీఎం సమాధానం ఇచ్చారు. సత్తెనపల్లి–అచ్చంపేట వరకు బస్సులను నిర్ణీత సమయం ప్రకారం తిప్పాలని సత్తెనపల్లికి చెందిన పద్మ అనే ప్రయాణికురాలు కోరగా .. సమయం ప్రకారం తిప్పుతామని డీఎం సమాధానం ఇచ్చారు. రాజుపాలెం మండలం రెడ్డిగూడెం బస్టాండ్‌ను రీ మోడల్ చేయాలని, బస్సులను బస్టాండ్‌లో నిలపాలని రెడ్డిగూడెంకు చెందిన హనీఫ్ అనే ప్రయాణికుడు కోరగా .. రెడ్డిగూడెం బస్టాండ్‌ను రీమోడల్ చేయించి బస్సులను బస్టాండ్‌లో ఆపుతామని డీఎం చెప్పారు. హైదరాబాద్ – తిరుపతి సర్వీస్ బస్సులు బాగా పాతపడిపోయాయని, కొత్త బస్సులు పెట్టాలని సత్తెనపల్లికి చెందిన అనీల్ అనే ప్రయాణికుడు కోరగా .. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రయార్టీ ప్రకారం కొత్త బస్సులు వచ్చిన వెంటనే మారుస్తామని డీఎం సమాధానం ఇచ్చారు.

క్రోసూరులో కుండపోత



క్రోసూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం కురిసింది. గంటపాటు భారీ ఉరుములు, కుండపోతగా కురిసిన వర్షానికి వీధులు, పొలాలన్నీ జలమయమయ్యాయి. క్రోసూరు నాలుగురోడ్లసెంటర్‌లో వర్షం నీటితో రోడ్డు మునిగిపోయింది. అదేవిధంగా ప్రధాన రహదారుల్లో వర్షం నీళ్లు చేరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వండి

- 15వ ఆర్థిక సంఘం నిధులు ఒక్క వార్డుకే ఎక్కువ కేటాయించటం ఏమిటి?
- మున్సిపల్ వైస్ చైర్మన్ కోటేశ్వరరావు నాయక్

సత్తెనపల్లి: పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరావు నాయక్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు ఎక్కువగా ఒక వార్డుకే కేటాయించారని, మిగిలిన వార్డులకు కూడా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణంలో అన్ని వార్డుల్లో బరియల్ గ్రౌండ్స్‌కు నిధులు కేటాయించినప్పటికీ 3వ వార్డులోని బరియల్ గ్రౌండ్‌కు నిధుల కేటాయింపు జరగలేదన్నారు. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటి నియంత్రణకు ఇంత వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఇటీవల ఒకే కుక్క 12 మందిని గాయపరచిన సంఘటన జరిగిందన్నారు. 3వ వార్డులో ఒక్కసారి కూడా ఫాగింగ్ జరగలేదని, దోమల వలన జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్ రంగిశెట్టి సుమన్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలో మున్సిపల్ స్థలాలు ఆక్రమించి అద్దెలకు ఇస్తున్నారని, ద్వితీయ శ్రేణి నాయకులు ఇలాంటివి చేయడం వల్లన ఎమ్మెల్యేకు చెడ్డపేరు వస్తుందని, అలాంటి వారిపై చర్యలు చేపట్టాలని కోరారు. రూ.70 లక్షల అభివృద్ధి పనులను ప్రభుత్వం మారగానే రద్దు పరిచారని, అప్పట్లో నగదు లేక చేయలేనని చెప్పిన కాంట్రాక్టర్ జితేంద్రకు ఇప్పుడు మళ్లీ రూ. 30 లక్షల అభివృద్ధి పనులు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. దీనిపై ఎక్స్‌అఫిషియో హోదాలో హాజరైన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆ కాంట్రాక్టర్ ట్రాక్ బాగా లేదా అని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మిని ప్రశ్నించారు. కమిషనర్ షమ్మి మాట్లాడుతూ కాంట్రాక్టర్ ట్రాక్ బాగానే ఉందని, కానీ ప్రభుత్వం మారాక మీరు చెప్పటం వల్లనే అప్పట్లో పనులు రద్దు చేశామన్నారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ తురకా మేరీగ్రేస్ మాట్లాడుతూ పట్టణంలో శానిటేషన్ అస్తవ్యస్తంగా ఉందన్నారు. 22వ వార్డు కౌన్సిలర్ శెట్టి ఆనంద్, 19వ వార్డు కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు పలు సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పట్టణంలో ఆక్రమణల ఏమి ఉన్నా, అవి ఎవరివి అయినా సరే తొలగించాలన్నారు. ట్రాఫిక్ సమస్య పైన పట్టణ పోలీసులతో చర్చిస్తానన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగే సమయానికి గత అజెండాలో పెట్టిన పనులు ఎంతవరకు పూర్తయ్యాయి? ఏ స్టేజిలో ఉన్నాయో వాటి ప్రగతి నివేదిక ఉండాలన్నారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ పట్టణంలో ఆక్రమణలను తొలగించేందుకు వెంటనే చర్యలు చేపడతామన్నారు. ముందుగా అజెండాలోని 3వ అంశం మినహా మిగిలిన అన్ని అంశాలను ఆమోదించారు. బుధవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనిని ఆమోదించక పోవడం కొసమెరుపు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్‌మీరాన్, కౌన్సిలర్లు కో–ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్



సమస్యలను ఆలకిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పక్కన చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి

రూ. 38.50 లక్షల అభివృద్ధి పనులకు 'ఉత్తుత్తి' శంకుస్థాపన



సత్తెనపల్లిలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



(ఇన్‌సెట్) శిలాఫలకంపై పొంగులేటి నారాయణగా ఉన్న మంత్రి పేరు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని వడ్డవల్లి రాజీవ్‌గాంధీ కూరగాయల మార్కెట్ వద్ద రూ.38.50 లక్షలతో దక్షిణం వైపు కాంపౌండ్ వాల్ నిర్మాణం, డబ్ల్యూఎం ఫ్లాట్‌ఫామ్, తూర్పువైపు కాంపౌండ్ వాల్ నిర్మాణం, స్టెయిన్ లెస్ స్టీల్ రెయిలింగ్, జీఐ షీట్‌తో రూఫింగ్ ఏర్పాటు కోసం సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అయితే బుధవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో అజెండాలోని 3వ అంశం అయిన రూ.38.50 లక్షల అభివృద్ధి పనిని కౌన్సిల్ ఆమోదించకపోవడంతో వాయిదా వేశారు. ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన పనికి కౌన్సిల్ ఆమోదించక పోవడంతో ఉత్తిత్తి శంకుస్థాపనేనా అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణను కాస్త పొంగులేటి నారాయణగా మార్చి శిలాఫలకం వేయడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. శంకుస్థాపనలో మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసీ, కమిషనర్ కొలిమి షమ్మి, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం

క్రోసూరు: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని, మానసిక ఆరోగ్యాన్ని కూడా పెంపొందించుకోవాలని క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ధనుష్ అన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయానికి హాజరై బాలికలకు ఆరోగ్యాంశాలపై అవగాహన కల్పించి వైద్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏమైనా ఇబ్బందికర లక్షణాలుంటే తక్షణమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలు ఉపయోగించుకోవాలని తెలిపారు. సీహెచ్‌ఓ సాంబశివరావు, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్, పాఠశాల ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని, ఆరోగ్య కార్యకర్త హైమావతి, ఆశా కార్యకర్తలు చంద్రిక, పావని లక్ష్మి, కేజీబీవీ ఏఎన్‌ఎం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ధనుష్

కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ

వినుకొండ(నూజెండ్ల): స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్రకళ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీల శక్తిసామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం, ఇతర వసతి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలతో మాట్లాడుతూ రానున్న పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో ఎలాంటి ఇబ్బందులున్నా వెంటనే సమాచారం ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరమ్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దోమపోటు నివారణపై అవగాహన అవసరం

జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం డీడీ ఎం.శివకుమారి



మాట్లాడుతున్న డీడీ ఎం.శివకుమారి

రాజుపాలెం: మండలంలోని నెమలిపురి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఎం.శివకుమారి పాల్గొని రైతులకు వరి పంటపై తెగుళ్ల చీడపీడలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పైరులో దోమపోటు నివారణకు రైతులు పొలాన్ని పర్యవేక్షిస్తూ దోమ ఉధృతిని కనిపెట్టాలని తెలిపారు. ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే దోమ దుబ్బి అడుగు భాగాన చేరి క్రమేపీ పైకి ఎగబాకుతు దుబ్బి యొక్క రసాన్ని పీల్చడం వలన పైరు పటుత్వాన్ని కోల్పోయి సుడులు సుడులుగా ఎండిపోవడం, పడిపోవడం జరుగుతుందని తెలిపారు. ఈ తెగులు నివారణకు ఎకరాకు 20 కిలోల పొటాష్ పిచికారీ చేయాలన్నారు. ఏఓ పి.వెంకట నరసయ్య, వ్యవసాయ సహాయకులు ముస్తాక్, భవాని, వర్లా శ్రీనివాసరావు, లక్ష్మణరావు, బెల్లంకొండ వాసు, నరసింహారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో..

క్రోసూరు: బయ్యవరం, ఊటుకూరు గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ–పంట నమోదు చేయించుకున్న రైతులకు రైతు సేవా కేంద్రంలో ఫిజికల్ ఎక్నాలెడ్జ్‌మెంట్లు ఇస్తున్నట్లు తెలిపారు. రబీ సీజన్ నుంచి పంటల బీమా పథకం కోసం రైతులు ప్రీమియం చెల్లించవలసి ఉంటుందన్నారు. పీఎం కిసాన్, రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువుల పంపిణీ తదితర విషయాలను వివరించడం జరిగిందన్నారు. సీసీఐ ద్వారా పత్తి అమ్మదలిచిన రైతులు రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. రైతు సేవా కేంద్ర సిబ్బంది గ్రేస్ ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

నకరికల్లు: వరిలో పాముపొడ తెగులు నివారణకు సత్వర చర్యలు చేపడితే పంటను కాపాడుకోవచ్చని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని నకరికల్లు,శివాపురం తండా గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ దేవదాసు వరిలో సస్యరక్షణ చర్యలను వివరించారు. పీఎం కిసాన్‌కు సంబంధించి ఫార్మర్ ఈకేవైసీ ఇంకా నమోదు చేసుకోని వారు సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్‌లో సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్.సుభాని, వై.ప్రభాకర్, వెటర్నరీ ఏహెచ్‌ఏ జి.సూర్యప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

బొల్లవరం(ముప్పాళ్ళ): వరిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తూ, తెగుళ్ల, పోషక లోప లక్షణాలపై రైతులు ఎప్పటికప్పుడు గుర్తించేలా అవగాహన పెంచుకోవాలని వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ శివకుమారి చెప్పారు. మండలంలోని బొల్లవరం గ్రామంలో పొలం పిలుస్తొంది, వరి, మిరప, పత్తి రైతులకు శిక్షణా కార్యక్రమం బుధవారం జరిగింది. ఏఓ ఎం.అరుణ, ఏఈఓ పి.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఇరువురు క్రీడాకారుల ఎంపిక

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురు క్రీడాకారులు అండర్–17 విభాగంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు బిఎం. సుభాని బుధవారం తెలిపారు. తాడికొండ నియోజకవర్గంలోని రావెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి అండర్–17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఇరువురు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో బి. బాలకృష్ణ ఎంపికవ్వగా, బాలికల విభాగంలో కె. చిత్రదీపిక ఎంపికయ్యారన్నారు. నవంబర్ 25వ తేదీన అనంతపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టులో పాల్గొని ఆడతారన్నారు. ఎంపికైన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు వై.సైదయ్య, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఇట్టే ఏడుకొండలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు.



బి. బాలకృష్ణ



కె. చిత్రదీపిక

సంసిద్ పాఠశాల విద్యార్థికి బంగారు పతకాలు



శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామ పరిధిలోని సంసిద్ పాఠశాల నందు 9వ తరగతి చదువుతున్న అథ్లెటిక్స్ పరుగుపందెం పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు ఒంటేరు నాగ సురేష్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 29న గుంటూరు జిల్లా సిరిపురంలో జరిగిన ఎస్.జి.ఎఫ్.ఐ 600 మీటర్ల 400 మీటర్ల పరుగుపందెం పోటీల్లో ప్రథమస్థానం సాధించినట్లు తెలిపారు. నవంబరు 4న పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో అండర్–14 విభాగంలో ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఇదే విధంగా ప్రతిభ కనపరిచి మరిన్ని పతకాలు సాధించి పాఠశాలకు తమ తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థి నాసరయ్యను వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.